# తెల్లవారని బతుకు

(కథానిక)

గుమ్మం ఎక్కుతుండగానే తమ్ముడి ఏడుపు వినిపించింది. చిరాకుతో ఛీత్కరించుకొంటూ గబగబ లోపలికి వెళ్ళాడు గురువులు.

మూల నుక్కిమంచంమీద ముసుగుదన్ని సావకాశంగా వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు రంగడు. ఆవేశంతో ముసుగు ఛట్టునలాగేశాడు.

"ఏం ఏడుస్తున్నావ్?"

వాడు వెక్కుతూ "అమ్మ...కొట్టింది" అన్నాడు.

"ఏం, ఎందుకు?"

"ఐస్. ఐస్‌ఫ్రూటు కొనిమ్మంటె...పేక బెత్తంతో దబదబ బాదింది."

గురువులు మరేం అడగలేదు. ఏదో బాధ మనస్సులో మూలిగింది. నిట్టూర్పువిడచి వెనక్కి తిరిగేసరికి యెదురుగా తల్లి వచ్చింది.

"అబ్బబ్బ, పట్టాడంటే ఒకటే పట్టు. వీధంటపోయే ప్రతివాళ్ళనీ పిలుస్తాడు. అవి కొనిస్తావా ఛస్తావా అని యిల్లెగిరిపోయేట్టు పోరుపెడతాడు. డబ్బుల్లేవంటె ఒకంతటూరుకొంటాడా? రాళ్ళుచ్చుకొని సామాన్లన్నీ బద్దలు గొట్టేస్తాడు."

చెమటతో తడిసి ముద్దయిపోయిన మోటు ఖద్దరు చొక్కాని విప్పి గోడకి చేరేసిన నులక మంచంమీద వుంచుతూ చాప పరచుకొని మేను వాల్చాడు. పగలంతా యెముకలు పిండయేట్టు పనిచేశాడేమో, అలసిపోయిన వొంటికి ఆ పడక ఎంతో హాయినిచ్చింది. తృప్తిగా ఒక్క నిట్టూర్పు విడుస్తూ కళ్ళు మూశాడు.

కాసేపట్లో తల్లి పిలుపు వినిపించి కళ్ళు తెరచాడు. సీతమ్మ సంచి తీసుకొని కొడుకు దగ్గరికి వస్తూ "బియ్యాం నిండుకొన్నాయి. బజారుకెళ్ళి యెలాగన్నా సంపాయించుకు రావాలి. ఇప్పుడుగాని బద్ధకిస్తే మరి రేపటికి కడుపులో కాళ్ళెట్టుకొనిపడుకోవలసిందే" అంది.

"అసల్లేవూ? మొన్ననేకదూ కార్డుమీద తెచ్చారు?"

"వాళ్ళిచ్చే శేరు బియ్యం ఎన్నాళ్ళొస్తాయేం? ఇంట్లో చూస్తే పుట్టెడుమంది. ఇచ్చే బియ్యం మనిషికి రెండు గిద్దలు. అలాంటప్పుడు శేరు బియ్యం వారమంతా సరిపోతవనుకొన్నావేమిటి?"

క్షణంసేపు నిశ్శబ్దంగావుండి, నుదురుమీద చిరుచెమటని తుడుచుకొంటూ లేచి కూచున్నాడు.

చేతికి డబ్బిస్తూ "ఇవిగో రెండు రూపాయలిస్తున్నాను. రెండు శేర్ల బియ్యంకొని డబ్బేమన్నా మిగిలితే అదాళ్ళ ఏదన్నా కూర గూడా పట్రా" అంది.

ఆ చెమటతో ముద్దయిపోయిన చొక్కానే మళ్ళా వేసుకొని, వెళ్ళేముందొకసారి వసారాలోకి పోయి కాసిని మంచినీళ్ళు తాగాడు.

వీధి మలుపు తిరిగేసరికి యెదురుగా ఎనిమిదేళ్ళ పెద్దకొడుకు పలకా పుస్తకాలతో పరుగు పరుగునవచ్చి తండ్రి కాళ్ళని చుట్టేశాడు. గురువులు వొంగి కొడుకుని ముద్దుపెట్టుకొంటూ "బడినించి యిప్పుడా వస్తున్నావ్?" అనడిగాడు.

వాడు తలూపుతూ "బళ్ళో ఆట్లాడిస్తున్నారు నాన్నా. మాకు బంతాట గూడా నేర్పిస్తున్నారు. నేనూ ఆడాను. చాల బాగ ఆడాను నాన్నా. రాముగాడు ఆళ్ళేక పడి పార్లు పడ్డాడు" అంటూ నవ్వాడు.

గురువులు కొడుకు భుజం తట్టుతూ "సరే నువ్వింటికెళ్ళు నాన్నా. నీళ్ళూ అవీ పోసుకొని అమ్మతో ఆట్లాడుకో. నేను బజారు కెళ్ళి యిప్పుడే వచ్చేస్తాను. ఏం?" అన్నాడు.

వాడు తలూపి వెనక్కి తిరిగాడు. మళ్ళా ఏం అనుకొన్నాడో ఆగి "నాన్నా ఒ...ఒక

యన్. ఆర్. నంది

కొనీ యివ్వవు. ఏదన్నా కొనుక్కొంటాను" అనడిగాడు.

గురువులు చిరునవ్వు పెదవుల్లోనే మాయమై పోయింది. కొడుకు కేసి జాలిగా చూశాడు. పాపం, యెంత ఆశతో అడిగాడో. తనదగ్గర రెండు రూపాయలు తప్పితే చిల్లర ఒక్క దమ్మిడీగూడ లేదు. అటునించి వచ్చేప్పుడు దాన్లో అణా పరకో మిగులుతుందనే ధీమా లేదు. అయినా పిల్లాణ్ణి నిరుత్సాహ పరచగూడదని–

"అట్నుంచి తిరిగొచ్చి యిస్తానా న్నా. యిప్పుడుపోయి నీళ్లు కాచి పోసుకో. వెళ్లు" అన్నాడు.

వాడు నవ్వుతూ చప్పట్లు కొట్టుకొంటూ ఇంటివేపు పరుగుతీశాడు.

వెళ్ళిపోతున్న కొడుక్కేసి అలా చూస్తూ చాలసేపు వుండిపోయాడు గురువులు. వాడు తన మాటని నమ్మి వెళ్ళిపోయాడు. వాడికి తనమీద అపనమ్మిక యెప్పుడూ కలగదు. యెందుకో అర్థం కాలేదు. అదోలా చిరునవ్వు నవ్వుకొంటూ బజారువేపు నడక సాగించాడు.

సాయంకాలం కావస్తుందేమో రోడ్డు వచ్చేపోయేవాళ్ళతో రద్దీగావుంది. పగలంతా పని చేసి, విడుదలైన ఖైదీల్లాగ ఉద్యోగస్థులు, శ్రామికులు తిరిగి యిళ్లకి వచ్చేస్తున్నారు. వాళ్ళని ఒత్తిగించుకొంటూ గురువులు ధాన్యం పాకలకేసి దారితీశాడు.

జనసంచారం అక్కడ అంత ఎక్కువగా లేదు. రేషను అమల్లోకి రావడంవల్ల ధాన్యప్పాకలు చాలవరకు నీళ్లుపడ్డాయి. అక్కడక్కడ అమ్ముతున్నా. యెర్రబుట్టలకి అగుపించకండా, చీకటిబజారు వ్యాపారమే అది. గురువులుకి ఆ కొట్లు తెలుసు. ఒకకొట్టులోపలికి వెళ్ళాడు. చాలమంది వున్నారు. రెట్టింపు డబ్బు పెట్టయినాసరే ఎంతో అప్యాయంగా కొలిపించుకపోతున్నారు.

ఆ రద్దీకి భయపడి చాలసేపు లోపలికి వెళ్ళకండా అలానే స్తంభానికి ఆనుకొని నిలబడ్డాడు. ఇక చొరవ చేస్తేనేగాని ముక్తి వుండదని తెలీగానే ఇద్దరు ముగ్గుర్ని తప్పించి లోపలికి చొరబడ్డాడు. స్థిరంగా నిలవడానికి గూడ ఆస్కారంలేదు. కుడి ఎడమ మనుష్యులు కుమ్మేస్తున్నారు. చివరి కెలాగైతేనేం ముందుకి నెట్టుకొచ్చాడు.

"శేరెలాగ బాబూ?" అనడిగాడు కొలిచే మనిషిని.

"పద్నాలుగణాలు. తొరగా తీసుకో వయ్యా, యెనకాలింకా చాలామం దున్నారు" కసిరాడు వ్యాపారస్తుడు గురువులు మాటాడక పోవడంతో.

శేరు పధ్నాలుగణాలు చాల ప్రియమనిపించింది. తను రోజంతా పడే శ్రమతో ఆ ధరని కొలుచుకొన్నాడు. డబ్బిచ్చి బియ్యాన్ని తీసుకోడానికి మనసొప్పింది కాదు. తీసుకోకపోతే పస్తులు తప్పవు. ముందువెనక లూగిసలాడింది మనస్సు.

"ఏమిటయ్యా, తీసుకొంటావా లేదా? అవసరం లేకపోతే ఆ యెనకాతలోళ్ళకి జాగా ఇయ్యి."

గురువులు కనురెప్పలు కదిలాయి. ఏదో పరిష్కరించుకోవలసి వుంది. బేరం ఆడాలని బుద్ధిపుట్టింది.

"శేరు పన్నెండణాల కివ్వరు ..."

నోట్లో మాటలు నోట్లోనే వున్నాయి. ఇంతెత్తున తాచుపాములా కస్సునలేచాడు. "ఎల్లవయ్యా మా కొన్నావ్–పోపో" భుజం పట్టుకొని తోసేశాడు.

వెనకనించి సందు దొరకడమే తరవాయి, మరో యిద్దరు ముందుకు తోసుకొచ్చి ఆ కాళీని ఆక్రమించుకొన్నారు. క్రోధపు కోపం యింకా చల్లారలేదు–అరుస్తూనే వున్నాడు.

"బజార్లో యెక్కడా బియ్యమనే మాటవినిపించడం లేదు. ఇక్కడ పోనీ అని ఏదో ఒకరిద్దరికి అమ్ముతుంటె, అందులో బేరాలు. ఈళ్ళకి న్యాయంగా పోతే ఏం యిది లేదు. కొట్లు మూసేసి ఒకదగ్గర కూకుంటె కాళ్ల కాడికి వచ్చినట్టొస్తారు."

శేరు పధ్నాలుగణాలకే కొలిపించుకొన్న ఆ పెద్దమనుష్యులిద్దరూ చడీ చప్పుడు లేకండా గప్‌చిప్‌గా వెళ్ళిపోయారు. ఇక ఆలోచిస్తే లాభంలేదు. అందరూ తీసుకొంటున్నారు.

మళ్ళా ప్రయత్నం మీద ముందుకెళ్ళి ఆ అబ్బిని ఆ ధరకే రెండు శేర్లు కొలవమన్నాడు.

"అందరూ తీసుకొంటుంటే కనిపించడం లేదటయ్యా? ఆళ్ళకొక బేరం, నీకొక బేర వూఁనా?" అంటూ అతను చిరాకుగా తలగొట్టి రెండి శేర్లు కొలిచాడు. గురువులు దీనికి అభ్యంతరం చెప్పలేకపోయాడు. రెండురూపాయలూ నోరు నొక్కుకుని సమర్పించుకొన్నాడు. చిల్లర పావలా తీసుకొని బయటికి వచ్చేసరికి ముళ్ల డొంకలనించి బయటపడ్డంత పనైంది.

అక్కణ్ణించి తిన్నగా కూరగాయల మార్కెట్ కేసి దారి తీశాడు.

అక్కడా రకరకాల మనుష్యులు వున్నారు. వకీళ్లు, ఉపాధ్యాయులు, పెద్ద ఉద్యోగస్తులు గూడ వచ్చి కాయగూరల దగ్గర బేరాలాడుకుంటూ, ఇది కాదని అది, అది కాదని యిది- మేలు రకం కోసం ఈ కొట్టు నచ్చక మరో కొట్టుకి, అక్కడా నచ్చక మరో దగ్గరకి తచ్చాడుతున్నారు.

గురువులు మొదటి కొట్టు దగ్గరే కూచొని వంకాయలు పట్టి చూశాడు. కూరలు తాజావే. మిలమిల్లాడుతూ వున్నాయి. ఇంకా నలుగురైదుగురు వంకాయలు, దొండకాయలు, బంగాళా దుంపలు కొలిపించుకొంటున్నారు.

"వంకాయలు వీశెలాగోయ్?" అనడిగాడు గురువులు మూడోసారి.

ఊపిరి పీల్చుకోడానికి వీలు చిక్కడం లేదా మనిషికి. కంగారుగానే "పావలా బాబూ" అంటూ మరో మనిషికి దొండకాయలు తూచడంలో నిమగ్నుడయ్యాడు.

గురువులు వంకాయల్ని పట్టి చూస్తూ ఆ అబ్బి చెయ్యి తట్టి "వీశె మూణ్ణాల కిస్తావ్?" అనడిగాడు.

అతను చిరునవ్వు నవ్వుతూ గురువులు కేసి చూసి తీసుకోమన్నాడు.

అరె యింకా తక్కువ కడిగినా యిచ్చివుండేవాడు సుమా! అని మథనపడ్డాడు. మళ్లా ఆత్మతృప్తికోసం-పోనీలే అమాయకుడి దగ్గర బేరాలెందుకు అని వూరుకొన్నాడు. నచ్చిన వంకాయల్ని ఏరుకొని తూయించుకొన్నాడు.

సంచిలో వేసుకొన్న తర్వాతనిలబడి చొక్కా జేబీలోని డబ్బుల్ని తీసి ఆమనిషి కందించాడు.

డబ్బుల్ని ఆ వ్యక్తి గుర్తించలేదు.

"ఓయ్, డబ్బులివిగో. తీసుకొని అణా తిరిగి ఇచ్చెయ్."

ఆమనిషి మరొకరికి దుంపలు తూస్తున్నాడు. మరి ముగ్గురు గూడ వచ్చి అతన్ని చుట్టేశారు. ఆ గొడవలో తన బేరగాడి డబ్బుల మాట అతనికి గుర్తులేదు. గురువులు మరోసారి భుజం తట్టాడు. కాని అతని కా గొడవే వినిపించలేనట్టుంది!

గురువులుకి మహా చిరాకు వేసింది. అతని చేతిలో పెట్టాలని ముందుకి వొంగాడు. కాని వెంటనే మనస్సేదో దుర్బోధ చేయనారంభించింది. చైతన్య రహితుడై అలానే వుండిపోయాడు. గుండెదడ హెచ్చింది. శరీరం కంపించింది. అంత్యస్థితి సమీపించేసరికివొళ్ళంతా ముచ్చెమటలు పోశాయి. కాళ్ళు వొణికాయి. తెప్పరిల్లేసరికి ఎందుకో భయం వేసింది. చుట్టూ వున్న వాళ్ళంతా వేయి కళ్ళతో తన్నే కనిపెడుతున్నట్టు భ్రమ పడ్డాడు. ధైర్యం చేసి వాళ్ళకేసి చూడడానికిగూడ సాహసం చాలింది కాదు.

తలలో ఏ శక్తి ప్రేశపించిందో అప్రయత్నంగా సంచితీసుకొని రోడ్డుమీది మనుష్యుల్లో కలిసిపోయాడు. ప్రతి మనిషినీ కంగారుగా తప్పించుకొంటూ ముందుకి చొచ్చుక పోతున్నాడు. ఏ శబ్దం వినిపించినా తన్ని ఎవరో వెన్నంటుతున్నారని భయపడిపోయాడు.

పార్కు దగ్గరకి వచ్చేసరికి జనసంచారం చాలవరకు పలచబడింది. తన్ని తాను గుర్తించుకొనేసరికి నోరెండిపోయి, మాట స్తంభించిపోయింది. చేతులు రెండూ చెమటలో తడిసిపోయాయి. ఇంతవరకు ఎడం చేతిలో ఒక బరువైన సంచి వున్నట్టే జ్ఞాపకంలేదు. దృష్టి దాని మీద పడేసరికి అప్రయత్నంగా కుడి పిడికిలి తెరుచుకుని తడిసి ముద్దయిపోయిన పావలా ఫక్కున నవ్వింది. ఒక్కసారి గుండె దడదడలాడింది.

ఇల్లు చేరుకొనే సరికి ఎదురుగా కొడుకు వచ్చాడు. వస్తూనే తండ్రిని చుట్టేసి "ఇవ్వావు

నాన్నా?" అనడిగాడు.

కొడుకుకేసి చూడగానే కొత్త స్థితిత పడ్డాడు. వెంటనే ఆ దొంగ పావలాని వాడికి యిచ్చేయాలనుకున్నాడు. కాని చెయ్యి చాసే సరికి మనస్సొప్పిందికాదు. వాడికొక్కవలసింది ఒక్క అర్థణా. ఇందులో ఎనిమిదున్నాయి అలాంటివి. మిగతావి వాడి కనవసరం. చిల్లర మారిస్తే అవి యింకెందుకైనా తనకి పనికొస్తా యనుకొన్నాడు. ఈ భావం కలగడమే తరువాయి, రోడ్డుమీదకి వెళ్ళి పెట్టిదుకాణం అబ్బి దగ్గర చిల్లర మార్చి, పిల్లాడికో అర్థణా యిచ్చి లోపలికి వెళ్ళాడు.

చన్నీళ్ళ స్నానం చేసి రాత్రి భోజనం అయిన తర్వాత ఆరుబయట నులక మంచం వేసేసి పడుకొన్నాడు. గోదావరిగాలి మెల్లగా వీస్తూందేమో హాయిగా మైన వంటి కది ఎంతో హాయి అనిపించింది. అంతలో లక్ష్మి చంటి దాన్ని భుజాన్నేసుకొని లోపలనించి వచ్చింది.

"పడుకున్నారా?"

తలెత్తి "లేదు... ఏం?" అన్నాడు గురువులు.

"జీతాలు ఎప్పుడందుతాయి?"

"మరో నాల్రోజుల్లో...ఎందుకేమిటి?"

లక్ష్మి భర్త పక్కకి వచ్చింది. "ఒక్కచీర గూడ గట్టిది లేదు. అన్నీ చింకి బొంతలై పోయాయి. అలాగలా పోగులు పోసుకొని పొదుపుగా వాడుకొంటున్నాను. ఇప్పుడవ్వి గూడ ఎందుకూ పనికి రాకండా పోయాయి. ఈ జీతాలకన్నా ఒకటి తీసుక రాకపోతే..." తీసుకరాకపోతే పర్యవసానం ఏవిటో మరేం చెప్పలేదు.

గురువులు మాటాడలేదు. ఆ ప్రయత్నం చేసే స్థితిలోగూడ లేదు. ఏదో ఆలోచిస్తున్నట్టు ఎడంచేత్తో నుదురు రాచుకొంటున్నాడు.

"ఏవంటారు?"

"చూస్తాన్లే" సమాధానమిస్తూనే లేచి అటు రోడ్డుకేసి వెళ్ళిపోయాడు.

తారురోడ్డు దాటి కంకరరోడ్డుమీద చాల దూరం వెళ్ళిపోయాడు. రోడ్డుమీద జనసంచారం లేకపోవడంతో ఆగి చుట్టూ చూశాడు. కనుచూపు మేర మనిషనే మాటలేదు. వెనక్కి తిరిగి చూశాడు. లేడీ హాస్పిటల్ గూడ దాటి పోయింది! మళ్ళా అడుగుల్ని వెనక్కి తిప్పు కొన్నాడు. కాసేపట్లో ఫ్యాక్టరీకి వచ్చిపడ్డాడు. తొమ్మిదిన్నర అయిందో ఏమో రోడ్డుమీద దీపాలు ఆర్పేశారు. కరెంట్ లేకపోవడం మూలాన ప్రభుత్వమే పొదుపు విధానాన్ని ఆచరిస్తూంటే తన యింట్లో తనుగూడ ఎందుకు సర్దుకు పోగూడదు?

ఎంతవరకు సర్దుకోవాలి? చారు నీళ్ళ దగ్గర్నుంచి, చన్నీళ్ల వరకూ పొదుపుగా ఖర్చు చేసినా నెల ముప్పై రోజులూ గడవడమే ఒక గండంలావుంది. పోషించే మగదిక్కు ఒక్కడు. తినే వాళ్ళు చూస్తే పుట్టెడు మంది. వీళ్ళ కోసం రెక్కలెంత విరుచుకొన్నా ప్రతిఫలం మాత్రం నెలకి అరవై నిండవు.

ఇంటికి వచ్చాడు. అందరూ నిద్రపోయారు. వాకిట్లో రెండు కుక్కలు గూడ పడుకొని వున్నాయి. మెల్లగా లోపలికి వచ్చాడు. గూట్లో దీపం బుడ్డి వొత్తి బాగా తగ్గించి లక్ష్మి పిల్లదాన్ని పక్కన వేసుకొని వొత్తి నులక మంచం మీద నిద్రపోతోంది. పిల్లలిద్దరు చాప మీద తెలివి లేకండా నిద్రపోతున్నారు. ఈ దృశ్యం రోజూ తను చూసేదే ఐనా, ఈవాళ మాత్రం కళ్ళల్లో పొడిగా నీళ్లు తిరిగాయి. చంటిదాని శరీరం నులక తాళ్ళమీద యింతంత లావున దద్దుర్లెత్తి పోయింది. ఇది చూసేసరికి మరింత జాలేసింది.

ఆ చివర తనకోసం ఒక తలగడ, ఎర్రంచుల బొంత, నులక మంచం వున్నాయి. తనెలాగూ కష్టపడతాడు. అందువల్ల కష్టాన్ని కొంతవరకు ఓర్చుకోగలడు. కాని చంటిది? గబగబ వెళ్ళి ఆబొంత తీసుకొచ్చి మంచంమీద పరిచి చంటిదాన్ని దానిమీద వేశాడు. తర్వాత తను నులకమంచంమీదే నిద్రపోయాడు.

తొలికోడి కూయగానే అత్తా కోడళ్లిద్దరూ లేచారు. సీతమ్మ వాకిలితుడిచి కళ్ళాపు వేసింది. లక్ష్మి పాచిపనులన్నీ చేసుకొంది. రాత్రి కొద్దిగా మిగిలిన అన్నాన్ని గురువులు లేచిన తర్వాత ఉప్పేసి పెట్టింది. తిన్నతర్వాత గురువులు పనికి బయలుదేరాడు. లక్ష్మి దగ్గరగా వచ్చి ఏదో చెప్పాలనుకొంది. కాని అతను

వేసుకొంటున్న మాసిన మాసికల బట్టలని చూసి ఏమీ మాటాడలేక రెండడుగులు వెనక్కి వేసింది.

"ఏంకావాలి లక్ష్మీ?"

అతని పిలుపుకి ఆగింది. తనొచ్చిన కారణాన్ని అతనికి చెప్పాలా వద్దా అని కాసేపు తటపటాయించింది. చివరికి మెల్లగా "ఎవరి దగ్గరన్నా రెండురూపాయలు అప్పుతీసుకొని అందాకా పాలడబ్బా తెస్తే జీతాలందగానే తీర్చేయొచ్చు. నాదగ్గర అసలు పాల్లేవు. పిల్ల అవిలేక చిక్కిపోతోంది..." అనగలిగింది.

గురువులు తలవూపి నిట్టూర్పే సమాధానంగా పనికి వెళ్లిపోయాడు.

సాయంకాలం పనినించి తిరిగి వస్తున్నపుడు పాలడబ్బా మాట జ్ఞాపకానికి వచ్చింది. చివరివారంలో అప్పుపుట్టడం చాలకష్టం. పాలడబ్బాలమ్మే నారాయణని బతిమాలితే అందాకా అరువిస్తాడు. జీతం అందిన వెంటనే తీర్చెయ్యొచ్చు. నారాయణగూడ చాల మంచి మనిషి. అడిగితే తీసి పారెయ్యలేదు.

తిన్నగా నారాయణ దుకాణానికి వెళ్లాడు. దుకాణంలో నారాయణే వున్నాడు. బతికాననుకొన్నాడు. లోపలికి వెళ్ళాడు. అతను తన్ని చూడగానే అరువు సంగతి ఎత్తాలనుకొన్నాడు. కాని ధైర్యం చాల్లేదు. సంకోచించాడు.

నారాయణే ముందుగా అడిగాడు "ఏం కావాలి?"

"ఆఁ...పాలడబ్బా..."

నారాయణ పాలడబ్బా ఒకటి తెచ్చాడు. ఇస్తూనే "అబ్బ, దుకాణం పెట్టుకొని వ్యాపారం చేసేంత నరకం మరొకటిలేదు గురువులు. చెబితే నమ్మవు. ఈ ఒక్క దుకాణంతో నా పసంతా వూడిపోతోందనుకో..." అన్నాడు.

"ఏం....మరో నౌకర్ని పెట్టుకోగూడదూ?"

"నౌకరుకోసం కాదు గురువులు. సరుకేది? యుద్ధం తర్వాతంతా నక్లీ సరకు, స్వరాజ్యం వచ్చిన తర్వాత వున్న సరుకే మాయం- ఇలాగుంది. టోకునే బ్లాకులో కొంటుంటె యిక చిల్లరనెలా అమ్మాలో ఏంపాలుపోవటంలేదు."

"అందరిలాగే మీరుగూడ బ్లాకుమార్కెట్టు చేస్తే..."

"వద్దు గురువులూ, అంత పాపానికి నేను ఒడికట్టుకోలేను. ఒకవేళ చేద్దామనుకొన్నా అది మనకి చేతనవొద్దూ? అందుకనే ఈ వ్యాపారం వొదిలేసి మరేదైనా చేయాలనుకొంటున్నాను."

గురువులు మనస్సులో మరో సంగతి మూలుగుతుండడంవల్ల సరైన సమాధానాలు చెప్పలేకపోతున్నాడు. ఇంతవరకు ఒకలాగున చెప్పగలిగాడుగాని, ఇకమీదట అవీ నోటినించి పెగల్లేదు. డబ్బాకేసి యిటూఅటూ తిప్పుతూ చూస్తున్నాడు. నారాయణ యింకా ఏదో చెప్తకపోతున్నాడు. ఒకటీ చెవిని సోకటంలేదు.

"డబ్బా ఖరీదెంత?" చివరికి అడిగాడు.

"రూపాయిన్నర. కిట్టడం ఏడణాలకి కిట్టింది. అణా లాభానికన్నా అమ్ముకోకపోతే..."

"అవునవును. సరేగాని నారాయణగారు" సంకోచించాడు గురువులు.

"ఏవిఁటి గురువులు? చెప్పు ఫర్వాలేదు."

"ఊఁ...ఇప్పుడు ప్రస్తుతానికి నా దగ్గర డబ్బులేదు. ఎల్లుండి జీతాలందుతాయి అఁదాకా ఈ పాలడబ్బా..."

అర్ధోక్తిలో నారాయణ అందుకున్నాడు: "అరువేనా? తీసుకో గురువులు. ఈ మాత్రం దానికేనా యింత సంకోచం? జీతమందిన తర్వాత అలానే యిద్దువుగాని"

గురువులు ధన్యవాదా లర్పించి పాలడబ్బాతో యింటిదారి పట్టాడు. సమయానికి సరిగా ఆదుకొన్నాడు నారాయణ. తనకీ అతనికీ ఏమంత పరిచయంలేదు. ఏదో అప్పుడప్పుడు పాలడబ్బాలు కొనుక్కోడంలోనే పరిచయమయింది. మరి ఆ వేళా విశేషం ఎలాంటిదో, ఇద్దరిమధ్యా ఒకవిధమైన స్నేహం ఏర్పడింది.

సోమవారం జీతాలు అందాయి. ప్రొద్దుట పనికి వెళ్ళేప్పుడు లక్ష్మి చీరగురించి జ్ఞాపకం చేసింది. అందువల్ల ముందుగా బజారుకిపోయి ఒకచీర కొన్నాడు. తిరిగి వచ్చేటప్పుడు నారాయణ దుకాణం దగ్గరకివచ్చాడు పాలడబ్బాబాపతు రూపాయన్నర యిచ్చేయాలని. కాని

నారాయణ దుకాణంలో లేదు. రేపువచ్చి తీర్చవచ్చనుకొన్నాడు.

ఇంటికి వచ్చీ రాగానే లక్ష్మికి చీర అందిచ్చాడు. కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళన్నా యివ్వకండా చీర నందుకొని అక్కడే విప్పి చూసుకొంది.

"ఎంత?"

"పది" అన్నాడు గురువులు చిరునవ్వు నవ్వుతూ.

"పదిరూపాయలే!" ఆశ్చర్యంగా చూసింది "పదిరూపాయల కెందుకీ చీర?"

"మరేం చెయ్యాలి? చచ్చినా ఒక్కదమ్మిడీ తగ్గించమని వాళ్ళంటె?"

"తగ్గించకపోతే వాళ్ళముఖానకొట్టి వచ్చేయవలసింది. ఐనా మీకు బేరమాడ్డం బొత్తిగా తెలీదు."

"మంచి మాటన్నావ్! బేరమాడి చెప్పు దెబ్బలు తినమనా నీ వుద్దేశ్యం? వాళ్ళంత ఖచ్చితంగా చెబుతుంటె ఏం బేరమాడాలి?"

"అయితే వాళ్ళ దబాయింపులకి జడిసి నోరు నొక్కుకొన్నా రన్నమాట!" అంది లక్ష్మి నవ్వాపుకొంటూ.

ఇంతలో బయటనించి పిలుపు వినిపించి మెల్లగా వెలుపలకి వచ్చాడు. వాకిట్లో నిలబడ్డ మనిషి చూసి గతుక్కుమన్నాడు. ఒక్క గుటక వేసి గుడ్లప్పగించి వూరుకొన్నాడు.

"అలా తేరపారి చూస్తావేం? నే నేనోయ్. రంగయ్యని" అన్నాడా వ్యక్తి.

రెప్పలు రెపరెపలాడాయి. చేతులు నులుపుకొంటూ దగ్గరగావచ్చి నమస్కారం చేశాడు గురువులు.

రంగయ్య నమస్కారం అందుకొంటూ ఒక దగ్గుదగ్గి పైమీది కండవాతో నోరు తుడుచుకొన్నాడు. చేతిలో పుగాకు కాడ పీలుస్తూ గురువులు కేసి చూడకండానే చాల సౌమ్యంగా అడిగాడు, "జీతాలు అందాయికదూ?"

గురువులు తలూపాడు.

"మరెందుకలా బాకీని పెంచుకోవడం? ఎప్పటి డబ్బప్పుడు చెల్లించేసుకొంటే మంచిది కాదూ?"

గురువులు తల పంకించాడు. అటూ యిటూ చూశాడు. ప్రాధేయపడుతూ చివరకి చేతులు పట్టుకొని– "రంగయ్యగారు. మీ మూణ్ణెల్ల యింటద్దీ వచ్చేనెల పూర్తిగా యిచ్చేస్తాను. ఈ నెల చాల తక్కువ జీతం దొరికింది. దయతలచి యిప్పటికి..." బతిమాలాడు.

"లాభం లేదోయ్. ఎక్కువ జాలిపడితే రేపొద్దుట నువ్వు దాన్ని నా చేతగాని తన మనుకొంటావ్."

"అబ్బె. అలా నేనెందుకనుకొంటానండి?"

"అబ్బే లేదు గిబ్బే లేదు. బాకీ అంతా యిప్పుడే చెల్లించేయాలి, ఏమైనా సరే."

ఇక గురువులు బ్రతిమాలినా, ప్రాధేయ పడ్డా లాభం లేకపోయింది. ఖచ్చితంగా యిస్తావా లేక యిరవై నాలుగు గంటల్లో ఇల్లు ఖాళీచేసిపోతావా అని పట్టుపట్టాడు రంగయ్య. చివరికి యిద్దరూ ఒక ఒప్పందానికి వచ్చారు. ఈ నెల పది రూపాయలు చెల్లించి మిగతా పాతిక ఎలాగైనా వచ్చేనెల తీర్చేట్టు పరిష్కారం చేసుకొన్నాడు గురువులు.

ఇంటద్దెకు పది పోను వచ్చిన జీతంరాళ్లల్లో మిగిలింది నలభై. దాంతోనే ఈ నెలంతా ఈడ్చుకపోవాలి, ఎలావుంటుందో ఏమో... లోపలికి తలొంచుకొని వెళ్లాడు. ఎదురుగా సీతమ్మ వచ్చింది.

"ఇచ్చేశావా డబ్బంతా?"

గురువులు తలూపాడు.

సీతమ్మ క్షణం ఆగి: "ఎందుకొచ్చిన గోలంతా యిది? నెలనెల జీతం అందగానే ఆ డబ్బేదో అతని మొఖాన పారేస్తుంటే వొదిలిపోతుంది. నెలనెలికి వాయిదాలు వేస్తుంటే అప్పింకా పెరుగుతుందేగాని తరిగిపోదు. అదీ గాక పోయినా చీటికీ మాటికీ అతగాడి బెదిరింపులు గూడా తగ్గిపోతాయి" అంది.

నిజమే. ఇచ్చేడబ్బు యిచ్చిగూడా అతని చేత తిట్లు తినవలసి వస్తోంది. కాని తన బ్రతుకెంత యింతా చేస్తే? నెల మూడో రోజుకి అరవై రాళ్లు. ఈ పక్కనించి ఆ పక్కకి తిప్పేసరికి ఆ పచ్చనోటు కాస్తా చప్పబడి పోతుంది.

"ఇటు చూడబ్బాయ్. అదిగాక, కోడలు

జబ్బుపడ్డప్పుడు అప్పు తెచ్చిన రెండొందలు వడ్డీమీద వడ్డీ చొప్పున యిప్పటికి రెండొందల పాతికై కూచొంది. అది మనం తినాలేదు చెయ్యాలేదు. అన్యాయంగా పెరిగిపోతే తీర్చేప్పటికి తాతలు దిగొస్తారు. అందువల్ల నా మాటవిని తీర్చేవేవో త్వరగా తీర్చేసుకోంటే"

"ఇక మరి నన్నేం చెయ్యమంటావ్? నేను మాత్రం కూచొని గోళ్లు గిల్లుకొంటున్నానా? ఇంకా ఎక్కడ చావమంటావ్రా బాబూ?"

"అదుగో, అలాగంటే యిలాగంటావ్? నిన్ను చావమనా నేననేది?"

"పోనీ ఎవడింట్లోనన్నా దూరి, దొంగతనం చేసి అప్పులు తీర్చేసి జైలుకి పోనా?" అంటూ ఎవరిమీదో పట్టరాని ఉక్రోషంతో వసారాలోకి వెళ్లిపోయాడు.

మాయజీవానికి శాంతి లేదు. స్థిరంగా కూచొని ఒక్కసారి హాయిగా ఎప్పుడూ నిట్టూర్పు విడిచి ఎరగడు. పుట్టిన దగ్గర్నుంచి చచ్చేవరకు కష్టాలు, బాధలు. అవన్నీ మనిషి కోసమే రాసిపెట్టి వుండాలా? అప్పుడదిటైఫాయిడ్ జ్వరంతో మంచంపడితే వూరంతా గాలించినా అప్పు పుట్టలేదు. తాకట్టు పెట్టి తెచ్చుకోడానికి ఎలాంటి ఆస్తిపాస్తులూ లేవు. దిక్కుమాలిన పక్షుల్లా భూమ్మీద ఎందుకో ఎలానో బతుకుతున్నారు. చివరికి కాళ్లా వేళ్లా పడితే పులిరెడ్డి దగ్గర రెండు వందలు పుట్టాయి. రూపాయకి అణా వడ్డీ ఐనా తీసుకొన్నాడు. సమయం అలాంటిది. తీర్చే తలంపు అప్పుడంత పట్టించుకోలేదు. పెరిగిపోతున్న వడ్డీని తలచుకొని కూలిపోయాడిప్పుడు. మనోవ్యథతో మనిషి పూర్తిగా ఒరుగైపోయాడు. రాత్రి అన్నమన్నా తినకండా నిద్రపోయాడు.

తెల్లవారింది. సెలవరోజు. నారాయణదగ్గర చేసిన రూపాయన్నర అరువు జ్ఞాపకంమొచ్చింది. ఇలాంటి గోళ్ళతో మీటించి పాకేసేవాటిని గోడ్డళ్ళ వరకూ పెంచుకొంటే కాళ్ళ తాడు కంఠానికి తగులుకొందని. బాకీని తీర్చేయడానికి బజారుకి బయలుదేరాడు.

దుకాణంలో నారాయణ మాంచి ఉషారులో వున్నాడు. గురువులు లోపలికి వెళుతూనే ఏమ్మాటాడకండా అతని చేతిలో రూపాయన్నర పెడుతూ "పాలడబ్బా... డబ్బు..." అన్నాడు అస్పష్టంగా.

చేతిలోపడ్డ పైసాని చూస్తూ మందహాసం చేశాడు నారాయణ. "అంత తొందరేమొచ్చింది? రెండు మూడు రోజులు పోయిన తర్వాతే యివ్వలేకపోయావా?"

"అబ్బే, అలా వూరుకొంటే బాకీ సంగతే మర్చిపోతాం. అయినా, రేపు తీర్చేస్తాం అని తీసుకొన్న తర్వాత ఆలస్యం చేయడం ఏం బాగుంటుంది?"

"సరేగాని గురువులూ. రేపటినించి మా దుకాణాన్ని మరింత పెద్దది చేస్తున్నాం. బ్యాంక్‌లో నా పేర రెండువేలున్నాయి. అందులోంచి వెయ్యి రూపాయలు తెచ్చాను. దాంతో కొంత ప్లాస్టిక్ సామాను తెప్పిస్తే వ్యాపారం బాగా సాగుతుంది. ప్లాస్టిక్ సామాన్లమ్మడంలో మాంచి లాభం గూడా వుంది. వెధవది, ఎంతమ్మినా డబ్బామీద అణా రాదు ఈ పాలడబ్బాల వ్యాపారంలో. ఏమంటావ్?"

"ఆఁ ఆఁ" అన్నాడు గురువులు. నిజానికి నారాయణ ఏంచెప్పాడో సరిగా వినిపించుకోలేదు. ఆలోచనని నిలదొక్కుకునే సరికల్లా పోలిరెడ్డి బాకీ, దానిమీద అణాల వడ్డీ, భయంకరంగా రణగొణ ధ్వని చేస్తున్నాయి. శక్తి వున్నంత వరకూ నిలబడ్డాడు. తర్వాత నారాయణ దగ్గర సెలవుతీసుకొని అలా పిచ్చిగా అడుగులేశాడు.

బ్రిడ్జి దగ్గరకి వచ్చాడు. గలగలమంది అమరప్రవంతి. చూస్తూ గుడ్డిదిగువన కూర్చొన్నాడు. గంటలకొద్దీ అటు నది మధ్య వేసిన ఇసకతిప్పలకేసి చూస్తూ వుండిపోయాడు. నడి ఆకాశంలోకి సూర్యుడు వచ్చాడు. ఇసక వేడెక్కి ఆవిరిలా గాలిని కదుపుతోంది. ఆ ప్రకృతిని చూస్తున్నాడేగాని గురువులు మనస్సు దానిమీద లేదు. తను- తన పని- తన భార్యాబిడ్డల పోషణ- చుట్టూ ముసురుతున్న పురుగులు. ఏం చెయ్యాలి? వీటి నెలా వొదిలించుకోవాలి? వచ్చిన జీతం పొట్టలకే బొటాబొటిగా సరిపోతుంటే, ఇహ నాలుగు డబ్బులు వెనకేయడం ఎలా సాధ్యమో అర్థం కావటం లేదు.

నారాయణలా వ్యాపారం చేస్తే మంచి

లాభముంది. కాని దరిద్రగొట్టు వెధవ కాలు కదిపితే వడగళ్లవాన ఎదురుగ వస్తుంది. ఏవేవో ఆలోచనలు తిరిగాయి. రకరకాల వుపాయాలు మెరిశాయి. ఒక్కటీ మానవమాత్రుడనేవాడికి సాధ్యమయ్యే వుపాయాలు కావవి!

లేచి యింటికి తిరిగి వచ్చేస్తున్నాడు. పైన ఎండ భాద్రపద మాసమైనప్పటికీ మహాతీక్షణంగా వుంది. తను చేస్తున్న ముష్టిపని మానేసి నారాయణ నడిగి వ్యాపారం మొదలుపెడితే? సలహా అతని దగ్గర తీసుకొంటేనే మంచిది. ఈ ఆలోచన కలగడమే తరవాయి, నారాయణ దుకాణంకేసి గబగబ అడుగులు వేశాడు.

నారాయణ అమూల ఏదో పని చేసుకొంటున్నాడు. గురువులు లోపలికి వచ్చాడు. ఆ నీడ చాలా హాయి అనిపించింది. కాసేపు అడగాలా వద్దా అని తటపటాయించాడు. నారాయణ తనకి తాను వెనక్కి చూసి పలకరించినప్పుడే అడగాలనుకొన్నాడు. కాని పావుగంట గడచిపోయినా అతనిటు తిరిగి గురువులుకేసి చూడలేదు. గురువులుకి మరిక నిలబడటం కష్టమనిపించి పిలవాలనుకొని తిరిగాడు. దృష్టి ఆ డ్రాయరుమీంచి దొర్లేసరికి జిగేల్మంది!

ఊపిరి ఆడలేదు. కాళ్ళు భూమిలో కృంగిపోతున్నట్టనిపించింది. డ్రాయరుమీద మనీపర్సు! తెరచేవుంది! పచ్చకాగితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి! నారాయణకేసి చూశాడు.

ఛీ! అనిపించింది. తన్నుతాను తిట్టుకొంటూ జారిపోతున్న శక్తిని నిలదొక్కుకోవడానికి వ్యర్థప్రయత్నాలు చేశాడు. అవును, ఎందుకు తనంత పిరికిగా వొణికిపోవాలి? తనేమైనా దొంగతనం చేస్తున్నాడా? అలాంటి అభిప్రాయాలు కలుగుతున్నవా? మరెందుకు కంపించిపోవాలి?

చూడకూడదు చూడకూడదనుకొంటూనే మళ్ళీ ఆ పర్సుకేసి చూశాడు. కరెన్సీ నోట్లు తన దారిద్ర్యాన్ని జ్ఞప్తికి తెచ్చాయి. అక్కు జబ్బుకి చేసిన చక్రవడ్డీ అప్పూ- ఇంటద్దె పాతిక- మడతకుడుముల బ్రతుకు- అన్నీ ఏదో చెవిలో రహస్యంగా చెప్పాయి. శ్వాస తీవ్రమయ్యే కొద్దీ విచక్షణా జ్ఞానం క్షీణించిపోతోంది. అటు చూశాడు. నారాయణసలు ఇటు చూడనే లేదు. చప్పున వెళ్లి పర్సు లాగి జోబీలో కుక్కుకొని రోడ్డుమీదికి ఉడాయించాడు.

(ముగింపు వచ్చే సంచికలో)

కథానిక

# చెడిపోయిన సీతమ్మ

అవసరాల రామకృష్ణారావు

అశుభాన్ని సూచిస్తూ సీతమ్మ గుండెలు ధన్ ధన్‌మని కొట్టుకున్నాయి. లేకపోతే ఏమిటిది? మొన్న వినాయక చవితికి పదమూడేళ్లు వెళ్ళినా స్కూలు నుంచి రాగానే పుస్తకాలు గదిలో పడేసి తన ఒళ్ళో అయిదు నిమిషాలు ఆప్యాయంగా కూర్చోందే ఉండలేక పోయే వాడే మధు! ఇవాళ్టిదేమిటీ యిలా చేస్తే! తన వైపు చూడలేదు, తన ఊసులేదు! తిన్నగా గదిలోకి వెళ్లి ముసుగుతన్ని పడుకున్నాడు. ఏమిటీ అలకలోని అంతరార్థం! బాధిత హృదయంతో గదిలోకి వెళ్లింది సీతమ్మ.

“నాయనా మధూ! ఒంట్లో బాగులేదా? స్కూల్లో ఎవరేనా ఏమయినా అన్నారా? మేష్టారు కొట్టేరా?” మధ్య మధ్య భరించలేని నిశ్శబ్దాలతో వరుసగా అడిగింది సీతమ్మ. అంతకన్నా అడగవలసిన ప్రశ్నలు తోచలేదావిడకి. ఒక్కదానికీ జవాబు లేకపోవటం చూసి ఆమె మనస్సు సంశయంతో ఊగిసలాడింది. “ఏమిటిది? తన చేతుల్లో పెరిగిన వీడూ తండ్రి గుణాలే తెచ్చుకున్నాడా? సత్యాన్ని పరికించలేని కళ్లు వీడికీ వచ్చాయా?”

అతని అలకకు కారణం, సంశయానికి అర్థం అడగకుండానే తెలుసుకుందా విజ్ఞానమయి. ఏనాడో ఒకనాడు ఈ సత్యం అతను గమనించ